


నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

ఎన్టీఆర్ కృష్ణా

ఆదివారం 1 జూన్ 2025 పేజీలు 8


యోగాతో అన్నదాతకు
## ఆరోగ్య సిరుల పంట



- యోగా, ధ్యానంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం
- బిఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో విజయవంతంగా రైతన్నల థీమ్ యోగా
- రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఎస్.డిల్లీరావు, జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ

వివరాలు 8 లో

మన పూర్వీకులు మనకు ఇచ్చిన
# గొప్ప వజ్రాయుదం యోగ



**మంగినపూడి బీచ్ తీరం వద్ద వెయ్యి మందితో పెద్ద ఎత్తున యోగా**

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందండి**

**మంత్రి కొల్లు రవీంద్ర, ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రతి రోజు యోగా చేసి సంపూర్ణ ఆరోగ్యం పొందాలని రాష్ట్ర గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ప్రజలను కోరారు. యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం మంగినపూడి బీచ్ తీరం వద్ద వెయ్యి మందితో పెద్ద ఎత్తున యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రితోపాటు ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ రావు, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు తదితరులు పాల్గొని యోగా ప్రియులను ఉత్సాహ పరిచారు. పచ్చని తివాచీపై యోగ అనే ఆంగ్ల అక్షరాలతో ఏర్పాటు చేసిన అక్షరాకృతులలో కూర్చోబెట్టి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక నుండి అంతర్జాతీయ యోగా శిక్షకులు శిరీష, అదేవిధంగా మరో యోగా శిక్షకులు పోతన శాస్త్రి సూచనలు చేస్తూ ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం వారి చేత యోగాసనాలు వేయించి అందరి చేత యోగ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమం మొత్తాన్ని డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పా ట్లు చేశారు. రాగి జావా, తాగునీరు, స్నాక్స్ అందించారు. కార్యక్రమం అనంతరం మంత్రి మాట్లాడుతూ యోగా విశిష్టతను ప్రజలందరికీ మిగతా 2లో...



పర్యాటకం, మచిలీపట్నం పోర్టు, పరిశ్రమల
# అభివృద్ధే ప్రధాన లక్ష్యం

**మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి సమీక్షించిన మంత్రి కొల్లు రవీంద్ర**

**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** మచిలీపట్నం అభివృద్ధిలో కీలకమైన పర్యాటకం, మచిలీపట్నం పోర్టు, పరిశ్రమల అభివృద్ధే ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం మంత్రి నగరంలోని స్థానిక రహదారులు భవనాల అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతో ప్రాచీన చరిత్ర కలిగిన మచిలీపట్నం ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ క్రమంలో రాష్ట్రంలో సురక్షితమైన బీచ్ ల్లో ఒకటైన మంగినపూడి బీచ్ ను ప్రసిద్ధ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ నేపథ్యంలో జూన్ నెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు మసులా బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు ఏర్పాట్లను ఇప్పటికే 2

జూన్ 2 నుండి 4వ వరకు
## ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పరీక్ష

- పరీక్షకు హాజరుకానున్న 660 మంది అభ్యర్థులు
- నగరంలోని నలంద విద్యా నికేతన్ కళాశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు
- డీఆర్ఓ ఎం. లక్ష్మీ నరసింహ

2

## అమ్మవారి దేవస్థాన భూముల్లో యదేచ్ఛగా అక్రమ మట్టితోలకాలు

వివరాలు 6లో...

నికోటిన్ చక్రబంధం నుంచి
## బయటపడండి..

- పొగాకు, గుట్కా, ఖైనీకి దూరంగా ఉండండి..
- యోగాంధ్ర క్యాంపెయిన్ సద్వినియోగం చేసుకోండి..
- ఆరోగ్యకర సమాజాన్ని నిర్మిద్దాం.. పొగాకు రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం..
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ




**ఎన్టీఆర్ జిల్లా బ్యూరో, మే 31, మేజర్ న్యూస్ :** ఊపిరితిత్తులు, క్యాన్సర్ వ్యాధులకు కారణమైన పొగాకు, గుట్కా, ఖైనీ వంటి మత్తుపదార్థాల నుండి ఆరోగ్యాన్ని పరిరక్షించుకునే విధంగా ప్రతి ఒక్కరిని మిగతా 7లో

# ప్రజల సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ ధ్యేయం



**మచిలీపట్నం మేజర్ న్యూస్ :** ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం ఉదయం రాష్ట్ర మంత్రివర్యులు నగరంలోని వారి కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. మంత్రి ప్రజల సమస్యలను ఎంతో ఓపికగా ఆలకించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని వారికి హామీ ఇచ్చారు.అనంతరం మంత్రివర్యులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ప్రతి శుక్రవారం శాసనసభ్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వారి నియోజకవర్గంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజా సమస్యలు తీర్చాలని సూచించారన్నారు.ఇందులో భాగంగానే శనివారం ప్రజా దర్బార్ నిర్వహించామని ఇప్పటిదాకా 100 అర్జీలు వచ్చాయని వాటన్నిటిని పరిష్కరించాలని కోరుతూ సంబంధిత అధికారులకు వాటిని పంపిస్తున్నామన్నారు.ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామన్నారు.అర్జీలలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రధాన సమస్యలైన రెవెన్యూ, భూమి,ఇళ్ల స్థలాలు, డ్రైనేజీ, గుంతల రహదారులు వంటి ప్రధాన సమస్యలు ఉన్నాయన్నారు.వచ్చే జూన్ నెల 12 వ తేదీన కొత్తగా 95 వేల మందికి పింఛన్లు ఇవ్వబోతున్నామన్నారు.రేషన్ కార్డులు కూడా సరిచేసి కొత్తవి ఇవ్వడం జరుగుతుందన్నారునిత్యావసర సరుకులు ఎండీయూ వాహనాల ద్వారా సరిగా పంపిణీ కాకపోవడంతో వాటిని నిలుపుదల చేసి వచ్చే జూన్ నెల 1 వ తేదీ నుండి పూర్వ పద్ధతిలోనే చౌక దుకాణాల ద్వారా ఆ సరుకులను పంపిణీ చేస్తున్నామన్నారు.ప్రజలు వారికి వీలైన సమయంలో చౌక దుకాణాలకు వెళ్లి కావలసిన సరుకులు తెచ్చుకునే సౌలభ్యం ఉందన్నారు. పేదలకు కళ్ళు దెబ్బ తినకుండా ఉండాలనే ఉద్దేశంతో తొలిదశలో దీపం-1 పథకం కింద కోటి గ్యాస్ సిలిండర్లను సరఫరా చేయడం జరిగిందన్నారు.దీపం 2 పథకం కింద ప్రస్తుతం ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామన్నారు. వచ్చే జూన్ మాసంలో పాఠశాలలు తెరిచే సమయానికి తల్లికి వందనం పథకం కింద విద్యార్థుల చదువు కోసం 15 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నామన్నారు. అలాగే పెట్టెడన్నం పెడుతున్న రైతన్నలను ఆదుకోవాలని ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 6000 రూపాయలకు మరో 14 వేల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం జోడించి మొత్తం 20 వేల రూపాయలను అన్నదాత సుఖీభవ పథకం కింద 3 విడతల్లో ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద 78 వేల రూపాయల వరకు రాయితీ ఉంటుందని, ఎస్సీలు ఎస్టీలకు ఉచితంగా, బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం మరో 20000 రూపాయలు కలిపి మొత్తం 98 వేల రూపాయలు రాయితీ ఇస్తుందన్నారు. నియోజకవర్గానికి 10,000 కనెక్షన్లు ఇస్తున్నామని ఇంకా అవసరమైతే అదనంగా కనెక్షన్లు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిగులు విద్యుత్ ఉత్పత్తి అయితే గ్రిడ్డుకు వెళుతుందని తద్వారా వినియోగదారులకు అదనపు ఆదాయం కూడా వస్తుందన్నారు.ఎన్టీఆర్ ఆరోగ్య సేవలు కింద పేద ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నామని నియోజకవర్గంలో 1.90 కోట్ల రూపాయలు పరిహారం మంజూరు అయిందన్నారురాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలందరూ సహకారం అందించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి కోరారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరపల్లి అనిత, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచే దుర్గ ప్రసాద్, స్థానిక ప్రముఖ నాయకులు గొర్రెపాటి గోపీచంద్, మోటమర్రి బాబా ప్రసాద్, ఎల్ వెంకటస్వామి బచ్చుల, అనిల్ కుమార్ తదితర అనధికారులు పాల్గొన్నారు.

# అంతర్గత రహదారుల అభివృద్ధికి చర్యలు



**గన్నవరం, మే 31, మేజర్ న్యూస్ :** గన్నవరం నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో అధ్వాన్నంగా ఉన్న అంతర్గత రహదారులను అభివృద్ధి చేసేందుకు గ్రామంలో నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం అంబాపురం, పినైనవరం గ్రామాల్లో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ, మండల పరిషత్ నిధులతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లను శనివారం ఉదయం యార్లగడ్డ ప్రారంభించారు. అంబాపురం గ్రామంలోని పి.హరిక ఇంటి వద్ద నుండి వై.చలపతి కుమార్ ఇంటి వరకు రూ.50 లక్షలతో, పి.నైనవరం గ్రామంలో డి.రంగా బ్యాంకు నుండి గంప శ్రీనివాసరావు ఇంటి వరకు రూ.25 లక్షల ఖర్చుతో, ఇదే గ్రామంలోని ఆర్ అండ్ బి రోడ్డు నుండి పి.వెంకటేశ్వర ఇంటి వరకు రూ.20.25 లక్షల ఖర్చుతో నిర్మించిన సిమెంట్ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు రాష్ట్రంలోని రోడ్లను నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులు కూడా గోతుల మయంగా మారటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు యార్లగడ్డ చెప్పారు. గన్నవరం నియోజకవర్గంలోని ప్రధాన రహదారులను అభివృద్ధి చేయడంతో పాటు ఇప్పటికే పలు గ్రామాల్లో అంతర్గత రహదారులను సీసీరోడ్లు గా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నైరుతి ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తాయి అన్న వాతావరణ శాఖ హెచ్చరికలు నేపథ్యంలో రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదలు సంభవిస్తే అంటువ్యాధులు ప్రజలే ప్రమాదం ఉన్నందున వాటి నివారణపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బంది దృష్టి సారించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ పి.నైనవరం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజయవాడ రూరల్ మండల టిడిపి అధ్యక్షులు గొడ్డళ్ల చిన్న రామారావు, అంబాపురం గ్రామ సర్పంచ్ గండికోట సీతయ్య, టిడిపి నాయకుల రామకృష్ణ, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ ఉద్యోగులు సమాజ సేవ చెయ్యాలి




**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** పదవి విరమణ చేసిన ఉద్యోగులు సమాజసేవకు అంకితం అవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్నికుల క్షత్రియుల వెల్ఫేర్, డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిలకలపూడి పాపారావు అన్నారు.శనివారం స్థానిక టీ టీ డీ కళ్యాణ మండపం లో నిర్వహించిన ఆర్టీసీ కండక్టర్ నడకుదిటి అర్జునరావు అభినందన సభ లో ఆయన పాల్గొని మాట్లాడుతూ 33ఏళ్ల తరువాత చట్ట రీత్యా పదవి విరమణ తప్పని పరిస్థితన్నారు. ఉద్యోగ రీత్య ఎంతో మంది ప్రజలు, సహచర ఉద్యోగులతో సాన్నిహిత్యం కలిగి ఉంటామని ఒంటరిగా మిగిలి పోతున్నామనే ఆలోచనను దరిచేరనీయ కుండా నచ్చిన సేవామార్గాన్ని ఎంచుకుని ఉత్సాహంగా మిగిలిన జీవితం గడపాలని కోరారు. అవనిగడ్డ ఆర్టీసీ డిపో మేనేజర్ కొక్కిలిగడ్డ హనుమంతరావు, ఆర్టీసీ డిపో రిటైర్డ్ డిఎం సైకం నాగభూషణం అగ్ని కుల క్షత్రియుల సంఘం జిల్లా కన్వీనర్ లకనం నాగాంజనేయులు మాట్లాడుతూ అంకిత భావంతో ఉద్యోగ బాధ్యతలు నిర్వ హించే అర్జునరావు లాంటి వారు అరుదుగా ఉంటారని, ఉద్యోగంతోపాటు సామాజక సేవా కార్యక్రమాలు కూడ నిర్వహిస్తూ ఉద్యోగులు, ప్రజల మన్ననలు పొందారన్నారు. అర్జునరావుకు దుశ్శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ ఉద్యోగులు,అభిమానులు పాల్గొన్నారు.

## 10 వేలకు పైగా బ్రాండ్లతో మింత్రా ఈవోఆర్ఎస్ 22వ ఎడిషన్




**విజయవాడ, మేజర్ న్యూస్ :** ప్రముఖ ఫ్యాషన్, సౌందర్యం, జీవనశైలి ఉత్పత్తులకు గమ్యస్థానాలలో ఒకటైన మింత్రా, జూన్ 12 వరకు తన ఫ్లాగ్‌షిప్ ఎండ్ ఆఫ్ రీజన్ సేల్ (ఈవోఆర్ఎస్) 22వ ఎడిషన్‌ను కొనసాగిస్తోంది. ఫ్యాషన్ ప్రియులు అందరూ ఎంతో ఆసక్తిగా వేచి చూస్తున్న ఈ షాపింగ్ ఈవెంట్ దేశవ్యాప్తంగా ఫ్యాషన్, సౌందర్య ప్రియులను ఆకట్టుకుంటోంది. మెట్రో, భారీ నగరాల నుంచి (టైర్ 1, టైర్ 2), అభివృద్ధి చెందుతున్న నగరాలకు చెందిన కొనుగోలుదారులు అంతర్జాతీయ, దేశీయ, స్వదేశీ బ్రాండ్‌లతో సహా 10 వేల కన్నా ఎక్కువ బ్రాండ్‌ల నుంచి నాలుగు మిలియన్లకు పైగా స్టైల్లలో విస్తృత ఎంపికను అన్వేషించుకునేందుకు మింత్రా అవకాశం కల్పిస్తోంది. ప్రతి ఒక్కరి అభిరుచి, ట్రెండ్‌కు అనుగుణంగా ఈ సీజన్‌లో వారికి కావలసిన అత్యంత స్టైలిష్ ఎంపికలతో, వారి వార్డ్‌రోబ్‌లు, బ్యూటీ షెల్ఫ్‌లను భర్తీ చేసుకోవాలని కోరుకుంటున్న వారికి వారికి ఇది చివరి గమ్యస్థానంగా నిలుస్తోంది.

## బదిలీలలో సరైన ఐచ్చికాల ఎంపికకు చర్యలు తీసుకోండి

### ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం

**విజయవాడ, మేజర్ న్యూస్ :** ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో కీలకమైన ఐచ్చికాల ఎంపిక ప్రక్రియను ఎటువంటి సాంకేతిక సమస్యలు లేకుండా సరళతరం చేసేలా విద్యాశాఖ తగిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మద్ది బాబు రాజేంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి చందోలు వెంకటేశ్వర్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ను కోరారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీకి చెందిన ఉపాధ్యాయులకు రెండు పోస్టులు లేదా వేకెన్సీలు ఉన్న అన్ని పాఠశాలలు వారు కోరుకోవడానికి వీలుగా చూపించాలని కోరారు. స్కూల్ అసిస్టెంట్లు పాఠశాలలను ఎంచుకునేటప్పుడు వారికి ఉన్నత పాఠశాలల్లో, ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లుగా, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా ఒకేసారి వారు ఎంపిక చేసుకొనేలా సాఫ్ట్ వేర్ ను రూపొందించాలని కోరారు. బాలికల ఉన్నత పాఠశాలల్లో ఖాళీలు మొదట మహిళా ఉపాధ్యాయినిలచే నింపేలా సాంకేతికంగా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అభ్యంతరాలను పరిష్కరించిన తదుపరి తుది సీనియారిటీ లిస్టులు విడుదల చేయాలని కోరారు. ప్రధానోపాధ్యాయుల పదోన్నతి అనంతరం ఏర్పడిన ఖాళీలతో తుది జాబితాను విడుదల చేసి బదిలీలలో ఉపాధ్యాయులు పాఠశాలల ఎంపిక సరళతరం చేయాలని కోరారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించినట్లు తెలియజేశారు.

## విద్యార్థినికి రూ.10వేలు నగదు ప్రోత్సాహకం అందజేత



**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** దివిసీమ భీమ్ జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోడూరు ఎస్సీ కాలనీకి చెందిన పదో తరగతి మెరిట్ విద్యార్థిని బత్తుల ప్రవల్లికకు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రూ.10వేలు నగదు ప్రోత్సాహకం అందించారు. అవనిగడ్డ నియోజక వర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన ఎస్సీ విద్యార్థులకు దివిసీమ భీమ్ జీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఒకరికి రూ.10 వేలు నగదు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇందులో భాగంగా ఈ సంవత్సరం 578 మార్కులు సాధించిన కోడూరు స్వతంత్ర్యపురం హైస్కూల్ విద్యార్థిని ప్రవల్లికకు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ చేతుల మీదుగా నగదును అందించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో ప్రవల్లికకు ఎమ్మెల్యే దుశ్శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల నుంచి దివిసీమ భీమ్ జీ అసోసియేషన్ నిర్వాహకులు పోలాబత్తిన బిపిన్ చంద్రపాల్ మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహం అందించడం అభినందనీయం అన్నారు. అసోసియేషన్ ద్వారా ఆయన చేపట్టిన పలు సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే కొనియాడారు. ఇలాంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని మరికొంత మంది సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు పోలాబత్తిన గోపాలం, విద్యార్థిని తండ్రి రాజు పాల్గొన్నారు.

## నూతన రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే



**పామర్రు మే 31 మేజర్ న్యూస్:** ఉయ్యూరులో నూతనంగా ఏర్పాటు చేసిన సాయిరాం ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభోత్సవ వేడుకలలో పామర్రు శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా పాల్గొన్నారు. ముందుగా ఆయన రిబ్బన్ కత్తిరించి రెస్టారెంట్ ను ప్రారంభించారు. అనంతరం శాసనమండలి మాజీ సభ్యులు యలమంచిలి బాబు రాజేంద్రప్రసాద్, నందమూరి సుహాసిని తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కొత్తపేట కోదండ రామాలయం వద్ద అన్న సమారాధన

**అవనిగడ్డ, మేజర్ న్యూస్ :** అమ్మ జయంతి పర్వతనాన్ని పురస్కరించుకొని అవనిగడ్డ శివారు కొత్తపేటలో వై వి ఆర్ పౌల్ట్రీ ఫారం ఆధ్వర్యంలో మూడు వేల మంది భక్తులకు అన్నసంతర్పణ నిర్వహించారు. శనివారం కొత్తపేట అగ్రహారంలో వేంచేసియున్న శ్రీ కోదండ రామాలయం వద్ద హనుమాన్ జయంతి సందర్భంగా అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని భజన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమ నిర్వాహకులు యలవర్తి రాజేష్, గరికపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ భాను, సనకా ఆంజనేయులు, భూపతి రేణుకయ్య, యలవర్తి వాసు, భూపతి శ్రీను, దివి శ్రీను, బర్మా రాఘవేంద్ర రావు, చందన సాయి, ముద్రగడ వాసు, భూపతి రాము, లక్ష్మణ్ ఆంజనేయులు, ముద్రగడ వాసు, యలవర్తి రవీంద్ర, అన్నపరెడ్డి కిరణ్, గాంధీ, అడపా కిషోర్, ముళ్లపూడి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## బలిపర్రు లాకు షట్టర్ల నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



**పామర్రు మే 31 మేజర్ న్యూస్:** పామర్రు మండలంలో పుల్లేరు కాలువపై బలిపర్రు లాకు వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న షట్టర్లను స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా శనివారం పరిశీలించారు. గతంలో ఉన్న షట్టర్లు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో నూతనంగా మంజూరైన 40 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా, నాణ్యతా ప్రమాణాలతో షట్టర్లు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే రానున్న సీజన్ నాటికి షట్టర్ల ఏర్పాటు పనులు పూర్తి చేయాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమార్ రాజా తో పాటు కృష్ణా డెల్టా ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, పామర్రు డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కొసరాజు వెంకటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు గొట్టిపాటి లక్ష్మీ దాసు, జక్కా శ్రీనివాసరావు, నీటిపారుదల శాఖ ఎస్ ఇ మోహన్ రావు, డిఇఓ భరత్, తదితర అధికారులు పాల్గొన్నారు.

## కళ్యాణమస్తు పథకం ద్వారా గోల్డ్ కాయిన్



**రెడ్డిగూడెం, మే 31, మేజర్ న్యూస్:** తిరువూరు క్లస్టర్ పరిధిలోని రెడ్డిగూడెం మండలం శ్రీరాంపురం గ్రామంలో గల పాల ఉత్పత్తిదారులు మానికల శ్రీదేవి కుమార్తె చాందిని ప్రియాంక వివాహము సందర్భంగా మన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని. ఆంజనేయులు ప్రవేశపెట్టిన కళ్యాణమస్తు పథకం ద్వారా అందించు రూ.20,000/- విలువ గల గోల్డ్ కాయిను క్లస్టర్ మేనేజర్ టి.సాంబశివ మూర్తి సంఘ అధ్యక్షులు నాదెళ్ల చెన్నకేశవరావు, గ్రామ సర్పంచ్ అట్లూరు శ్రీనివాసరావు చేతులమీదుగా శనివారం అందచేసినారు. కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులుకు రైతులు కృతజ్ఞతలుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు, రూట్ సూపర్ వైజర్ బి.శివనాగేశ్వరావు, వేతన కార్యదర్శి చీపి అప్పారావు,, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో తీర గ్రామాలకు ఉచిత తాగునీరు

**కోడూరు మే. 31 మేజర్ న్యూస్ :** బుధవారం కోడూరు మండలం ఇరాలి, బసవవానిపాలెం, చింతకోళ్ల గ్రామాల ప్రజలకు ఇరవై వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకర్ ద్వారా త్రాగునీరు సరఫరా చేశారు. మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ పర్యవేక్షించారు...

# అమ్మవారి దేవస్థాన భూముల్లో యదేచ్ఛగా అక్రమ మట్టితోలకాలు





**పెడన, గూడూరు, మేజర్ న్యూస్:** గూడూరు మండలంలో వేంచేసి ఉన్న ఎంకమ్మ పేరంటాల అమ్మవారి దేవస్థానం భూములో యదేచ్ఛగా అక్రమ మట్టి తోలకాలు జరిగాయని జనసేన నాయకులు బత్తిన హరి రామ్ ఆరోపించారు. ఈ సందర్భంగా హరి రామ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మట్టిపై పోరాటం చేసి తన ఆధీనంలో ఉన్న అమ్మవారి భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలను చూసి ఒక్కసారిగా తనకు ఆశ్చర్యం కలిగిందని అన్నారు. మట్టి దొంగతనానికి కాదేది అనర్హం. అది దేవుడి భూమైన, జనసేన నాయకుడు భూమైన 'ఉయ్ డోంట్ కేర్ అన్నట్టుంది మట్టి దొంగల వ్యవహారం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలోనైనా అక్రమ మట్టి దందా జరగదు అనుకుంటే గతంలో మట్టిపై పోరాటం చేసిన వ్యక్తి తాలూకు భూముల్లోనే మట్టి తోలుకు పోయారంటే మట్టి దొంగలు దేనికైనా సిద్ధపడుతున్నారని అర్థం చేసుకోవాలా అని అన్నారు. గత నాలుగు రోజుల కిందట ఈ ఆలయానికి సంబంధించిన వేలంపాట నిర్వహించారని ఆ వేలంపాటలో కౌలుదారినిగా ఆలయానికి సంబంధించిన ఆరున్నర ఎకరాలు తాను పాడుకున్నానని తెలిపారు. అంతేగాక గత సంవత్సరం పాట కంటే 42, వేలు పెచ్చుగా నేను పాట పాడవలసి వచ్చిందని ఆలయ భూముల రక్షణ కోసమే నేను పెచ్చుపాట పాడానని వాపోయారు. ఆ దేవుడు మాన్యంలో సుమారు 10 నుండి 15 సెంట్లు ఇంకుడు గుంట ఉందని ఆలయ ఈవో తనకు చెప్పారని కానీ తీరా స్థలంలోకి పోయి చూస్తే ఆ ఇంకుడు గుంట సుమారు 40, 50 సెంట్లు వరకు ఉందని చెప్పారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో దుక్కి దున్నుదామని ఆ పొలంలోకి వెళ్ళగానే ఆ ఇంకుడు గుంట పక్కన మరొక ఇంకుడు గుంట ఉండటం చూసి ఆశ్చర్యపోయానన్నారు. ఇది ఇంకుడు గుంట కాదని ఈ దేవాలయ భూములో రాత్రికి రాత్రి సుమారు 150 ట్రక్కుల మట్టిని ఐదు ఆరు అడుగుల లోతు వరకు తవ్వి అమ్మేసుకున్నారని తెలిసిందని స్పష్టం చేశారు. దీనిపై ఆలయ ఇవ్వు అని సంప్రదించగా ఆ భూమి గత కౌలుదారిది అని చెప్పాడని ఎవరిదో తేల్చాలంటే సర్వే కి అప్లై చేశామని తరువాత తెలుస్తామని ఈవో తనకు సమాధానం చెప్పారని అన్నారు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు దేవాదాయ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఈ అక్రమ మట్టి తవ్వకానికి పాల్పడ్డ వ్యక్తులను కఠినంగా శిక్షించవలసిందిగా నియోజవర్గ ప్రజల తరపున జనసేన పార్టీ నాయకుడిగా డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనియెడల అక్రమ మట్టి రవాణా పై కలెక్టర్ కి ఫిర్యాదు చేస్తాం అని హెచ్చరించారు.

# దేవుని గుడి అయితే మాకేంటి అని పెట్రేగిపోతున్న మట్టి మాఫియా



**పెడన, మేజర్ న్యూస్:** అంతా మా ఇష్టం ఎడాపెడా చెలరేగిన చెప్పేది ఎవడ్రా మా ఇష్టం అన్న చందంగా మండలంలో మట్టి మాఫియా పెట్రేగిపోతున్నారు అని మండల ప్రజలు వాపోతున్నారు. బుసక ట్రాక్టర్లతో రాత్రివేళ హల్చల్ చేస్తూ ప్రజలకు కంటి నిండా నిద్ర లేకుండా చేయడమే కాకుండా రోడ్లన్నీ పూర్తిగా ధ్వంసం అయ్యేలా తిరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారులు బుసక తోలకాలలో నిమగ్నమైన ట్రాక్టర్ డ్రైవర్లకు నిద్ర లేకపోవడంతో వారు ఎలా తోలుతున్నారో కూడా తెలియని పరిస్థితిలో దేవాలయాల మీదకు, ఇళ్ళ మీదకు ఎక్కి చేస్తున్నారు అని అంటున్నారు. ఏ ప్రాంతంలో చూసినా ఎక్కడ చూసినా బుసక ఇసుక ట్రాక్టర్లు టిప్పర్లు కనిపిస్తున్నాయి. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడితే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్న అంతా మా ఇష్టం అంటున్న మైనింగ్ మాఫియా. దీనికి నిదర్శనమే మండల పరిధి కోడూరు గ్రామంలో బుసక లోడుతో ట్రాక్టర్ నాగేంద్ర స్వామి దేవాలయంలోకి దూసుకుపోయింది. ఆ సమయంలో ఆ దేవాలయంలో పూజలు నిమిత్తం మహిళలు ఎవరు లేకపోవడం ప్రాణాపాయము తప్పినట్లే అక్కడ స్థానికులు చెబుతున్నారు. ఈ సంఘటన పట్టణ, మండల పరిధిలో తీవ్ర సంచలనాన్ని రేకెత్తించింది. రోడ్లపై ద్విచక్ర వాహనంతో వెళ్లాలంటే ఈ ట్రాక్టర్లను చూస్తుంటే మితిమీరిన వేగంతో వెళ్ళటంతో భయాందోళనకు గురవుతున్నామని పట్టణ ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఇటు రెవెన్యూ మైనింగ్ పోలీసు శాఖలకు సంబంధించిన అధికారులు స్పందించాలని ప్రజల కోరుతున్నారు.

## చక్కని ప్రణాళికతో పోటీ పరీక్షల్లో విజయం




**శారద డిగ్రీ కళాశాలలో ప్రొఫెషనల్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ సెంటర్ ప్రారంభోత్సవంలో వక్తలు**

**విజయవాడ మేజర్ న్యూస్:** పట్టుదల, ఆత్మవిశ్వాసం, చక్కని ప్రణాళికతో కృషి చేయడం ద్వారా పోటీ పరీక్షల్లో సులభంగా విజయం సాధించవచ్చని విశ్రాంత పోలీస్ అధికారి ఎం.సత్యనారాయణరావు అన్నారు. విజయవాడ గాంధీనగర్‌లోని శారద డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షలకు విద్యార్థులకు ఉచిత శిక్షణ అందించేందుకుగాను శారదా ప్రొఫెషనల్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ సెంటర్‌ను శనివారం ఉదయం ప్రారంభించి విద్యార్థులకు ఉచితంగా అందజేసే స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శారద ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందా రామనారాయణ మాట్లాడుతూ, డిగ్రీ కోర్సు పూర్తయ్యేలోగానే ప్రతి విద్యార్థికి ఉద్యోగ అవకాశం సాధించాలనే ఉద్దేశంతో శారద డిగ్రీ కళాశాల ప్రొఫెషనల్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్ ద్వారా వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ అందిస్తుందని తెలిపారు. బ్యాంకు పరీక్షలు, రైల్వే, ఎస్ఎస్సీ, నాబార్డు, గ్రూపు పరీక్షల్లో మంచి మార్కులు సాధించే విధంగా నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో శిక్షణా తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. శిక్షణా తరగతులు శారద డిగ్రీ కళాశాల విద్యార్థులతో పాటు ఇతర డిగ్రీ కళాశాల విద్యార్థులు కూడా వారికి అనువైన విధంగా ఎంపిక చేసిన బ్యాచ్‌లలో శిక్షణ తీసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర డిగ్రీ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు ప్రత్యేక బ్యాచ్‌లను ప్రారంభించనున్నట్లు తెలిపారు.

శిక్షణా కాలం నాలుగు నెలలు ఉంటుందన్నారు. ఎ.సి. క్లాస్ రూమ్‌లతో పాటు ప్రతిరోజూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పరీక్షలను నిర్వహిస్తామన్నారు. ల్యాబ్, లైబ్రరీ సౌకర్యం కూడా ఉందని తెలిపారు. శిక్షణా తరగతుల్లో పాల్గొన్న ప్రతిఒక్కరికీ నిపుణులచే రూపొందించిన పోటీ పరీక్షల పుస్తకాన్ని అందజేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల కరెస్పాండెంట్ బి.వరప్రసాద్, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ ఎస్.నాగేశ్వరశర్మ, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎల్.శ్రీధర్, కౌన్సిలర్ సత్యానందం తదితరులు పాల్గొన్నారు.



## గడ్డిపాడు లో రైతులకు వరి విత్తనాలు పంపిణీ

**పమిడిముక్కల మే 31 మేజర్ న్యూస్:** మండల పరిధిలోని హనుమంతపురం (గడ్డిపాడు) పాత సచివాలయంలో రైతులకు శనివారం వరి విత్తనాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మాజీ వైస్ ఎంపీపీ లింగమనేని బాబురావు, ఆర్యవైశ్య వాణిజ్య విభాగం నాయకులు యెండూరి పిచ్చేశ్వరరావులు రైతులకు వరి విత్తనాలు అందించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు రాజులపాటి రామాంజనేయ ప్రసాద్, మోపిదేవి శివ నాగరాజు, కొల్లూరి రాఘవులు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ రవితేజ తదితరులు పాల్గొని రైతులు కనుమూరి చిట్టియ్య, పరసా శివ నాగేశ్వర రావు, కోసూరి శ్రీనివాసరావు, గురిందపల్లి ప్రహ్లాద రావు, బంద్రపల్లి కాళిదాస్ లకు వరి విత్తనాలు పంపిణీ చేశారు.

# జూన్ 5న ఆంధ్ర మాదిగ సంఘాల రాష్ట్రస్థాయి సమావేశం




**13 జిల్లాల నుండి ఉద్యమ ప్రతినిధులు తరలిరావాలి**

**ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరావు మాదిగ**

**విజయవాడ మేజర్ న్యూస్ :** జూన్ 5న అమరావతి మంగళగిరిలో ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే ఆంధ్ర మాదిగ సంఘాల రాష్ట్రస్థాయి సమావేశానికి ఏపీలో ఉమ్మడి 13 జిల్లాల నుండి ఉద్యమ ప్రతినిధులు పాల్గొనవలసిందిగా ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరావు మాదిగ పిలుపునిచ్చారు. శనివారం గాంధీనగర్ లోని ఏపీ ఎంఆర్పీఎస్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరు పోగు వెంకటేశ్వరావు మాదిగ పాల్గొని మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో మాదిగలకు 7 శాతం రిజర్వేషన్ ఇచ్చిన చంద్రబాబు, విభజిత రాష్ట్రంలో మాదిగలకు 6 శాతం ఇవ్వడం ఇదేం సామాజిక న్యాయమని చంద్రబాబును ప్రశ్నించారు. అన్ని రంగాలలో బలపడ్డ మాల కులానికి మొదటి వరుసలో ఎనిమిది శాతం రిజర్వేషన్ ఇవ్వడాన్ని ఏపీ ఎంఆర్పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరావు మాదిగ తప్పుపట్టారు. మాదిగలకు ఏడు శాతం ఇచ్చి సమన్యాయం చేసేలా చట్టం చేయాలని పేరుపోగు వెంకటేశ్వరావు మాదిగ ప్రభుత్వాన్ని అని డిమాండ్ చేశారు. తెలంగాణలో మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అడిగిన మందకృష్ణ, ఆంధ్రాలో చంద్రబాబు మాదిగ లకు 6 శాతం ఇస్తాను అంటే ఎందుకు మాట్లాడటం లేదని మందకృష్ణను పేరు పోగు నిలదీశారు మందకృష్ణ వలనే ఆంధ్ర మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగుతుందని విమర్శించారు. మాదిగల్లో మేధావులు ఉద్యమకారులు లేనట్లు ఆర్ఎస్ఎస్ వాళ్ల సలహాలతో రాజకీయాలు చేస్తానని మంద కృష్ణ చెప్పటం సిగ్గుచేటు అన్నారు. నల్ల కండువా ముసుగులో మందకృష్ణ మాదిగలను ఆర్ఎస్ఎస్ కార్యకర్తలుగా మార్చే కుట్ర చేయబోతున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో అమరావతి రాజధాని అధ్యక్షులు మంద నాగమల్లేశ్వరావు, పులపాక మాణిక్యాలరావు, నంబూరి అనిల్ కుమార్, పగిడిపల్లి వెంకట్, గుద్దేటి మధుసుధన్ తదితరులు పాల్గొన్నారు.

# పూజ్యులు అహిల్యా బాయ్ హోల్కర్ త్రిశతాబ్ది జయంతి

**విజయవాడ మేజర్ న్యూస్ :** పూజ్యులు అహిల్యా బాయ్ హోల్కర్ త్రిశతాబ్ది జయంతి వేడుకలు కేదారేశ్వరపేట మండలం రాజరాజేశ్వరి పేట సుదర్శన వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో కృష్ణ మండల అధ్యక్షులు మాగులూరి లావిన్ బాబు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా జరిగాయి. భారతీయ జనతా పార్టీ జాతీయ స్థాయిలో ఎంతో గౌరవంతో, ప్రతిష్టాత్మకంగా నిర్వహించబోతున్న పుణ్య శ్లోక అహిల్యా బాయ్ హోల్కర్ త్రిశతాబ్ది జయంతి ఉత్సవాల్లో భాగంగా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ 300 సంవత్సరాల క్రితమే ఒక మహిళ 30 సంవత్సరాలు రాజ్యమేలడమే కాకుండా ఆమె పరిపాలనలో ప్రజలకు ఒక సుస్థిర పరిపాలనందించడం జరిగిందన్నారు. ప్రజలను ఆమె కన్న బిడ్డలలా చూసుకోవడం జరిగిందని, ఈరోజు పారిశ్రామికరణ జరుగుతున్న విధంగానే 200 సంవత్సరాల క్రితమే ఆమె రాజ్యంలో వస్త్ర పరిశ్రమలను నిర్మించడం ద్వారా ప్రజలకు ఉపాధి కల్పించడం, అదే విధంగా పారిశ్రామికీకరణ ప్రోత్సహించడం జరిగిందని ఆయన అన్నారు. అదేవిధంగా భారతదేశంలోని ఎన్నో ప్రఖ్యాత దేవాలయాలు ఆమె చేత నిర్మింపబడినవి, మరికొన్ని పునర్ నిర్మించబడినవి. 300 సంవత్సరాల క్రితమే మాతృ సాధికారికతకు ఆమె జీవితం ధారపోయడం




జరిగిందని, అటువంటి మహనీయురాలి త్రిశాబ్ద జయంతోత్సవాలు జరుపుకోవడం నిజంగా గర్వించదగిన విషయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి నున్న, కృష్ణ మండల అధ్యక్షులు మాగులూరి లావిన్ బాబు, దొండపాటి గాయత్రి వైదుర్య విజయ్ కుమార్, జ్యోతుల విజయ్, వసుంధర, బీజేపీ మహిళ కార్యకర్తలు నాయకులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. మైనార్టీ మహిళలు, పాల్గొనడం విశేషం.

# నికోటిన్ చక్రబంధం నుంచి బయటపడండి..



(మొదటిపేజీ తరువాయి)

చైతన్యవంతులను చేసి పొగాకు రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా శనివారం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థల సహకారంతో పొగాకు వల్ల కలిగే నష్టాల పై ముద్రించిన అవగాహన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ డా. జి లక్ష్మీశ ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పొగాకు వినియోగంతో మన శరీరంలోని అన్ని అవయవాలకు నష్టం జరుగుతుందన్నారు. ముఖ్యంగా ఊపిరితిత్తులు దెబ్బతినడమే కాకుండా క్యాన్సర్‌తో పాటు పక్షవాతము, అంధత్వము, రక్తనాళాలు గట్టిపడటం వంటి దీర్ఘకాలిక వ్యాధులకు గురయ్యే ప్రమాదం ఉదన్నారు. ఇప్పటికే పొగాకు, దూమపానం వంటి అలవాట్లు ఉన్నవారు తమ అలవాట్ల నుండి విముక్తి యోగాతో సాధ్యపడుతుందన్నారు. నెల రోజుల పాటు నిర్వహిస్తున్న యోగాంధ్ర క్యాంపెయిన్ సద్వినియోగం చేసుకోవాలన్నారు. దన, ప్రాణ, మాన హానికి కారణమవుతున్న పొగాకు, మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యం సాధనలో భాగంగా ఆరోగ్య కర సామాజ నిర్మాణంలో భాగస్వామ్యులు కావాలన్నారు. విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు జరపకూడదనే నిబంధనను జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా యువతీ యువకులు పొగాకు ఉత్పత్తుల వినియోగ వ్యామోహంలో పడకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు వారి అలవాట్లను గమనించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల్లో పొగాకు దుష్ఫలితాల అంశంపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. పొగాకు ఉత్పత్తుల అలవాటు పడిన వారు మానుకునేందుకు జిల్లా ఆసుపత్రిలోని డి%-%అడిక్షన్ కేంద్రాల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. కోట్పాయాక్ట్ జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు స్థానికంగా పొగాకు నిషేధ ఉత్పత్తుల అమ్మకాలు జిల్లాలో జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

కార్యక్రమంలో భాగంగా నేను సైతం ఎన్‌టీఆర్ జిల్లాను పొగాకు రహిత జిల్లాగా మారుస్తాను... సిగ్నేచర్ క్యాంపెయిన్‌లో సంతకం చేసి సంచార అవగాహన వాహనాన్ని ప్రారంభించారు.

అనంతరం నేను నా జీవితములో పొగాకు, ఇతర ఉత్పత్తులను వాడను, నేను నా పర్యావరణాన్ని పొగాకు ఉత్పత్తుల వినియోగం నుండి రక్షించేందుకు ప్రయత్నిస్తానని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీ నరసింహం, డియంఅండ్ హెచ్‌వో డా. యం సుహాసిని, ఫోరం ఫర్ చైల్డ్ రైట్స్ జిల్లా కో%-%ఆర్డినేటర్ అరవ రమేష్, నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యుటివ్ డైరెక్టర్ ఫాదర్ తంబి, ప్రోగ్రాం మేనేజర్ శేఖర్, కోఆర్డినేటర్ జాకబ్ రాజు పాల్గొన్నారు.






## కౌలు రైతులకు అవగాహన సదస్సు

**జగ్గయ్యపేట : మే 31 మేజర్ న్యూస్ :** మండలంలోని అనుమంచిపల్లి గ్రామంలో కౌలు కార్డుల పై రైతులకు అవగాహన సదస్సు కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారిణి మాట్లాడుతూ మండలం లోని అన్ని గ్రామాలలో ఈ నెల 30వ తారీకు నుండి జూన్ 12 వ తారీకు వరకు అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు కనుక కౌలు రైతులు తమ ఆధార్ కార్డు, పాస్ ఫోటో, పట్టాదారు పాస్ పుస్తకం జీరాక్స్ తీసుకొని తమ గ్రామంలోని వీఆర్వో ని సంప్రదించి కౌలు కార్డు పొందవలసిందిగా తెలియచేయడం జరిగింది. కౌలు కార్డు తీసుకోవడం వలన రైతులకు ప్రభుత్వం నుండి అందే అన్నదాత సుఖీభవ, పంటల భీమా, పంట నష్ట పరిహారం, పంట రుణాలు, సబ్సిడీ విత్తనాలు, ధాన్యం కొనుగోలు వంటి పథకాలుకు కౌలు రైతులు కూడా అర్హత పొందవచ్చని తెలియచేసారు. ఈ కార్యక్రమం లో ఏవో వరలక్ష్మి, ఎఇఓ శ్రీకాంత్, విఆర్ఓ వెంకటరత్నం, రైతులు పాల్గొన్నారు.

## వైయస్ఆర్ సీపీకి పూర్వ వైభవం తీసుకురావాలి



**జగ్గయ్యపేట :మే 31 మేజర్ న్యూస్ :** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని ఆ బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని మాజీ యంపి, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు మోదుగుల వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం ఎన్టీఆర్ జిల్లా విజయవాడ లోని ద కే హోటల్‌లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "వెన్నుపోటు దినం" పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "వెన్నుపోటు దినం" కార్యక్రమ పోస్టర్ ను ఎన్టీఆర్ జిల్లా నియోజకవర్గ సమన్వయకర్తలు, నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వైయస్ఆర్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్ ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. చంద్రబాబు నాయుడు హామీలు ఇచ్చి మాట తప్పారన్నారు. సూపర్ సిక్స్ లో ఒక్క గ్యాస్ సిలిండర్ పథకం తప్పా ఏ ఒక్కహామీ కూడా నెరవేర్చలేదన్నారు. వైయస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో జూన్ 4న నిర్వహించనున్న "వెన్నుపోటు దినం" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త వెలంపల్లి శ్రీనివాసరావు, సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు, తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాసు, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధి వేల్పుల రవికుమార్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ అవుతు శైలజా రెడ్డి, పి.ఏ.సి మెంబర్ షేక్ ఆసీఫ్, ఎన్టీఆర్ జిల్లా రైతు విభాగం అధ్యక్షులు ఏలూరి శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా వైకుంఠరావు, కార్పొరేటర్ అడపా శేషు, సీనియర్ నాయకులు కడియాల బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

## వీరులపాడు తహసీల్దార్ పదవి విరమణ



**వీరులపాడు,మే 31, మేజర్ న్యూస్ :** వీరులపాడు తహసీల్దార్ హుసేన్ పదవి వీరమణ కార్యక్రమం వీరులపాడు మండల ఆఫీస్ లో ఘనంగా జరిగింది. వీరులపాడు మండల తహశీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న హుస్సేన్ శనివారం పదవి విరమణ చేశారు. పదవీ విరమణ కార్యక్రమంలో ముఖ్యఅ తిథిగా ఆర్డీవో బాలకృష్ణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తహశీల్దారుగా హుస్సేన్ 42 సంవత్సరాల పాటు చిత్తశుద్ధితో నిబద్ధతతో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించారని కొనియాడారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని తెలిపారు. అనంతరం ఆయనను ఘనంగా ఉద్యోగులు తదితరులు సన్మానించారు.పలువురు నాయకులు ఆఫీస్ సిబ్బంది మాట్లాడుతూ హుసేన్ మంచి వ్యక్తిఅని వారి ద్రుష్టి కి ఏదేయేనా సమస్య వస్తే వెంటనే స్పందించి సమస్య ని పరిష్కారం చేసిన వ్యక్తి అని పాలవురు నాయుకులు పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ ఆఫీసర్ బాలకృష్ణ, టీడీపీ, నాయుకులు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో పెన్షన్లు పంపిణీ







**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** విజయవాడ తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామమోహన్ ఆదేశాల మేరకు శనివారం ఉదయం రాణి గారి తోట 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ పోలింగ్ బూత్ లు నాయకులు కార్యకర్తలు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. 17వ డివిజన్ తెలుగుదేశం పార్టీ పోలింగ్ బూత్ లు యూనిట్ ఇన్చార్జి ముని పోలిపల్లి మాట్లాడుతూ కీ.శే. అన్న నందమూరి తారకరామారావు ఆంధ్రప్రదేశ్ లో వికలాంగులు, వితంతువులు, వృద్ధులకి, పెన్షన్ విధానానికి శ్రీకారం చుట్టారు మొట్టమొదట 35 రూపాయలు నుండి 75 రూపాయలకి అన్న నందమూరి తారక రామారావు పెంచారు. 1995 - 2004 మధ్యకాలంలో విజినరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడు, 200 రూపాయలు చేశారు. ఆ తర్వాత ప్రభుత్వం 2014 తర్వాత 500 రూపాయలు నుండి 2,000 రూపాయలు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడు అయితే 3,000 రూపాయలు 2019లో ఎన్నికల హామీ నారా చంద్రబాబు పెంచి అవ్వ తాతలు ఆదుకుంటానని చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారు. దురదృష్టం సాతు ఓటమి చెందారు.

తర్వాత ప్రభుత్వం 250 రూపా యలు 2020లో 250 రూపాయలు 2021లో 250 రూపాయలు 2022లో 250 రూపాయలు 2023లో 2024లో నారా చంద్రబాబునాయుడు నాయ కత్వం వృద్ధులు 4000 రూపాయలు వితుందోవులు 4000 రూపా యలు వికలాంగులు 6000 రూపాయలు పూర్తిస్థాయి వికలాంగులు 10 వేల రూపా యలు మంచానికే పరిమితమైన వికలాంగులు కిడ్నీ వ్యాధిగ్ర స్తులుకి 15 వేల రూపాయలు కొత్తగా చేపల వేటకు వెళ్లి జాలర్లు చేనేత కార్మికులు. ట్రెండ్ జెండర్లుకు ఈ వర్గాలకి పెన్షన్ అందిస్తానని హామీ ఇచ్చిన మహానుభావుడు నారా చంద్రబాబు నాయుడు వారికి ప్రజల పట్ల ఉన్నటువంటి గౌరవం ఒక ఉదాహరణ చంద్రబాబునాయుడు సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళు అయితే సంపద సృష్టించటం చంద్రబాబు నాయుడు దీక్ష పట్టుదల క్రమశిక్షణను గుర్తుంచుకుని ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముని కృష్ణ, 17వ డివిజన్ టిడిపి కార్యనిర్వాహణ కార్యదర్శి వేల్పుల శౌరి, 17వ డివిజన్ టిడిపి ప్రధాన కార్యదర్శి మొకర అదిబాబు, 17వ డివిజన్ టిడిపి మహిళ అధ్యక్షురాలు మల్లెల కుమారి,17వ డివిజన్ టిడిపి మైనార్టీ సెల్ షేక్ మదర్, సీనియర్ టిడిపి నాయకులు మూల వెంకటేశ్వరరావు(కొండ), మొకర అప్పలనాయుడు, బోని తమ్మినాయుడు, కండుబొతు వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఈ- శ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోండి..



**విజయవాడ మేజర్ న్యూస్ :** సంఘటిత, అసంఘటిత రంగాలలోని పనిచేస్తున్న కార్మికులు ఈ- శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆవిష్కరించిన స్వర్ణాంధ్ర @ 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీగా లక్ష్యాలను చేరుకునే విధంగా జిల్లాస్థాయిలో కలెక్టరేట్ ప్రాంగణంలో శనివారం ఇగ్నైట్ ప్రత్యేక సెల్‌లో ఏర్పాటు చేసిన కార్మిక శాఖ స్టాల్‌ను జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఒక కుటుంబం- ఒక పారిశ్రామికవేత్త సాకారం దిశగా ఔత్సాహికులను సరికొత్త ఆలోచనలతో పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ సెల్ అవసరమైన సహాయసహకారాలు అందిస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి, వాటికోసం దరఖాస్తు చేసుకోవడంలోనూ తోడ్పడుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర కార్మిక శాఖలు, సంఘటిత, అసంఘటిత రంగాలలోని కార్మికులతో పాటు ఓలా, బ్లింకిట్, స్విగ్గి, జోమోటో వంటి అన్‌లైన్ ప్లాట్ ఫాం కార్మికులు, గిగ్ కార్మికులు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. అసంఘటిత రంగాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలను చేరువ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించిందన్నారు. ఆన్‌లైన్ ప్లాట్ ఫాం కార్మికులు, గిగ్ కార్మికులు ఈ- శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. తద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు కల్పిస్తున్న ఆరోగ్య, సంక్షేమ, ఆర్థిక (ఎక్స్ గ్రేషియా) ప్రయోజనాలను పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ-శ్రమ్ పోర్టల్ నమోదులో కార్మికులకు ఎదురయ్యే ఇబ్బందులను పరిష్కరించేందుకు జిల్లా కార్మిక శాఖ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఈ-శ్రమ్ పోర్టల్ లో నమోదు చేసుకున్న ఎం. పావనికి యూనిక్ ఐడి కార్డును జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అందజేశారు. స్టాల్స్ పరిశీలనలో డిఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, ఉపకార్మిక కమీషనర్ ఆషారాణి, అసిస్టెంట్ కమీషనర్ మహేష్ ఉన్నారు.

# పిల్లల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో ముఖ్యం

**వీఎంసీ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఇన్చార్జి డాక్టర్ లత**

**క్రీడలు చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయి**

**కార్పొరేటర్‌జాస్తి సాంబశివరావు**





**విజయవాడ కార్పొరేషన్, మేజర్ న్యూస్ :** పిల్లల మానసిక వికాసానికి క్రీడలు ఎంతో ముఖ్యమని డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఇంచార్జ్ డాక్టర్ కేయస్బీయస్.లత అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం ఆదేశాల మేరకు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ లో భాగంగా వేసవి క్రీడా శిక్షణలో పాల్గొన్న బాల బాలికలకు ముగింపు కార్యక్రమంలో గురు నానక్ కాలనీ, స్విమ్మింగ్ పూల్‌లో ఈత పోటీలు నిర్వహించి, ప్రతిభావంతులకు మెడల్స్ అందించారు డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ డాక్టర్ కేయస్బీయస్.లత, స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ ఇన్చార్జ్ డాక్టర్ కేయస్బీయస్.లత మాట్లాడుతూ వేసవి క్రీడా శిక్షణలో భాగంగా మే 1 నుండి మే 31 వరకు విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోగల అన్ని విఎంసి వేసవి శిక్షణ కేంద్రాలలో స్కేటింగ్, షటిల్ బ్యాడ్మింటన్, స్విమ్మింగ్, వంటి క్రీడల్లో శిక్షణ ఇచ్చారని, అందులో భాగంగా ముగింపు కార్యక్రమంలో గురునానక్ కాలనీలో గల స్విమ్మింగ్ పూల్‌లో ఈతల పోటీలను, సీనియర్స్, జూనియర్స్ గా విభజించి రెండు విభాగాలుగా నిర్వహించి 12 మంది ప్రతిభావంతులకు పతకాలు అందించారని తెలిపారు. చిన్నారులు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించాలని వారి మానసిక వికాసానికి క్రీడలు ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు మాట్లాడుతూ విజయవాడ నగరపాలక సంస్థ పర్యవేక్షణలో వేసవి కాలాన్ని సద్వినియోగం చేసుకునేలా చిన్నారుల కోసం నిర్వహించిన ఈ వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని, మానవ జీవితంలో చదువు ఎంత ముఖ్యమో, అదే విధంగా శారీరక ఆరోగ్యం, మానసిక వికాసం కోసం క్రీడలు కూడా అంతే అవసరమని, క్రీడలు చిన్నారుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని, నిబంధనలు పాటించడం, సమయం విలువ తెలుసుకోవడం వంటి విలువలను నేర్పుతాయని అన్నారు. ఈత పోటీల్లో పాల్గొన్న ప్రతి చిన్నారి విజేతలని, వారందరిలో ఉన్న ప్రతిభను ఈ శిక్షణ, పోటీలు వెలికి తీసి, భవిష్యత్తులో ప్రతిష్టాత్మక క్రీడా రంగాల్లో వారు ఎదగడానికి బలమైన పునాదిని వేస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, మెడల్స్ స్పాన్సర్ అరుణ, పూల్ ఇంచార్జి అప్పారావు, స్విమ్మింగ్ కోచ్లు కుసుమ, గౌతమ్, బహుధుర్, వేసవి శిక్షణ చిన్నారుల తల్లి తండ్రులు పాల్గొన్నారు..



## ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి పొట్ల రమణ చేతుల మీదగా పెన్షన్లు పంపిణీ

**కృష్ణలంక, మేజర్ న్యూస్ :** తూర్పు శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ పిలుపుమేరకు ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లు పంపిణీ కార్యక్రమం శనివారం ఉదయం స్థానిక 17వ డివిజన్ తారకరామా నగర్‌లో సచివాలయ 81 సచివాలయం అడ్మిన్ బాలకృష్ణ మహిళా కానిస్టేబుల్ నాగమణి వారితో ఈ కార్యక్రమం కొనసాగింది. కూటమి ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో అమలు చేస్తున్న పెన్షన్ల కార్యక్రమం ఈనెల ఒకరోజు ముందుగానే చేయడం ఆశించదగ్గ విశేషం రాణి గారి తోట లోని తారకరామా నగర్లో కడు పేదరికంతో పూర్తిస్థాయి స్లమ్ము ఏరియాలో తారకరామా నగర్ లో ప్రభుత్వ పథకాలన్నిటిని అమలు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రమణ తెలిపారు తారక రామా నగర్ వాసులు తెలుగుదేశం పార్టీ వెన్నంటే ఉండి పార్టీని అభివృద్ధి పథంలో నడిపించడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. తారకరామా నగర్ లో అనేక రోజువారి సమస్యలు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా పరిష్కారం చేసుకుంటూ వస్తుందన్నారు. ముఖ్య ముఖ్యంగా త్రాగునీరు డ్రైనేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నప్పటికీ అవినీత్యం స్థానిక శాసనసభ్యులు అధికారులను సమన్వయం చేసుకుంటూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు రమణ చెప్పారు. మెట్లు ఎక్కేటప్పుడు దిగేటప్పుడు వీధిలైట్లు లేకపోవడం వల్ల ప్రజలు ఉర్దులు కిందపడి గాయాల పాలవుతున్నారు. అని ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రమణ తెలిపారు. ఈ కార్య సునాభి, దైద మహేష్, మకర వెంకటరమణ, మొకర రంగమహాలక్ష్మి,మందుల వీరభద్ర, మార్కండేయులు, ఎస్కే రమీజా, మోరా విజయ, తదితరులు పాల్గొన్నారు.

18 వసంతాల 'సూర్య' మహాయజ్ఞంలో 'సూర్య' అక్షర సైనికుల భాగస్వామ్యంతో అనితర సాధ్యం కాని ఎన్నో లక్ష్యాలను అధిగమించింది. ఈ ప్రస్థానంలో సూర్యాక్షరంతో మమేకమైన 'సూర్య' కుటుంబ సభ్యులందరికీ అక్షర నమస్సులు. మాకు తోడుగా నిలుస్తున్న పాఠకులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పేరుపేరున కృతజ్ఞతాభివందనాలు.

ఇట్లు
ఎన్.వెంకట్, ఎన్టీఆర్ - కృష్ణా బ్యూరో
ఫోన్ : 9642 980 999